ఎల్‌ఆర్‌ఎస్ స్కీంపై జీవో విడుదల

విజయనగరం రింగురోడ్డు, జూలై30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్, పీనలైజేషన్‌కు సంబంధించి గతంలో జారీ చేసిన జీవో నెంబరు.10ని సవరించింది. తాజాగా జీవో నెంబరు.134 విడుదల చేసిందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 30లోపు అనధికార లేఅవుట్‌లో కొనుగోలు చేసిన ప్లాట్‌లను రెగ్యులర్ చేసుకోవడానికి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. ఉత్తర్వులు విడుదలైన తేదీ నుంచి 90 రోజులు(అక్టోబరు24 2025)లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

గందరగోళానికి తెర!

- స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత
- పీ4 'మార్గదర్శు'ల విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చిన సర్కారు
- కానీ అంతకుముందు జిల్లాలో భిన్న పరిస్థితి
- తప్పనిసరి అంటూ టీచర్లపై అంతర్గతంగా కొంతమంది విద్యాశాఖ అధికారుల ఒత్తిడి
- కలెక్టర్ ఉత్తర్వులతో మారిన సీన్..
- మౌఖిక ఆదేశాలు రద్దు



పార్వతీపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'పీ4'లో భాగంగా పేద కుటుంబాల బాగోగుల బాధ్య తను తీసుకునే 'మార్గదర్శు'ల విషయంలో ఏర్పడిన గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. ఈ కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందమని స్పష్టం చేసింది. అయితే అంతకుముందు కొందరు అధికారులు అవగాహన లేక తప్పనిసరిగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ప్రధానంగా విద్యా శాఖలో ఈ పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. దీనిపై టీచర్లకు అంతర్గతంగా మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా దీనిపై రాష్ట్ర ప్రభుత్వం , కలెక్టర్ కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో టీచర్లపై జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేశారు. వాస్తవంగా పీ4 కార్యక్రమంలో ఒక కుటుంబాన్ని ఎవరైనా దత్తత తీసుకోవడం అనేది పూర్తిగా స్వచ్ఛందం. ఎవరికైనా ఆసక్తి ఉంటే పేదలను పైకి తీసుకొచ్చే సదుద్దేశంతో మార్గదర్శిగా నమోదు



చేసుకోవచ్చు. మొత్తంగా నమోదు, సాయం అనేది స్వచ్ఛందమేనని సర్కారు తెలియజేసింది.

మానవతా దృక్పథంతో...

స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వారిని మార్గదర్శులుగా ఎంపిక చేయాలని అధికారులకు స్పష్టంచేశాం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మార్గదర్శుల ఎంపిక ప్రక్రియలో ఎవరిపై ఒత్తిడిలేదు. మానవతా దృక్పథంతో ఎవరైనా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని సాయం అందించొచ్చు.

- శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 350 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. అయితే 333 సచివాలయాల పరిధిలో గతంలో అధికారుల బృందం సర్వే నిర్వహించింది. ఈ మేరకు 42,815 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1,36,408 మంది కుటుంబ సభ్యులకు ఆర్థిక, ఆర్థికేతర సహకారం అందించాలని భావించారు. మొత్తంగా నిర్ణీత గడువులోగా కనీసం 33 వేల కుటుంబాలను దత్తత తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. కాగా ఈ నెల 28 వరకు 12,705 కుటుంబాలను 2,730 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.

మార్గదర్శులుగా ఉద్యోగులు

బంగారు కుటుంబాల దత్తత విషయంలో 24 శాఖలు తమ సహకారం అందించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. దీంతో

(మిగతా 8వ పేజీలో...)



పేదల అభివృద్ధికి కృషి

పార్వతీపురం మండలం పెద్దబొండపల్లిలో రెండు కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఆ కుటుంబాలను నాన్ ఫైనాన్స్ రంగంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ఈ విషయంలో నాపై ఎవరి ఒత్తిడి లేదు. స్వచ్ఛందంగా ఆ రెండు కుటుంబాలను దత్తత తీసుకున్నా. నాకు అవకాశం ఉన్నంత వరకు వారికి సహాయాన్ని అందిస్తా.

- రవికుమార్, ఉపాధ్యాయుడు, పెద్దబొండపల్లి, పార్వతీపురం మండలం

ఒత్తిడి చేశారు..

కొన్ని మండలాల విద్యాశాఖాధికారులు బంగారు కుటుంబాల దత్తత విషయంలో మార్గదర్శులుగా ఉండాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఇది సరికాదు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. టీచర్లపై ఎటువంటి ఒత్తిడి చేయకూడదని పీఆర్‌టీయూ తరఫున ప్రభుత్వాన్ని కోరాం.

- అమరాపు సూర్యనారాయణ, రాష్ట్ర పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు

ఆగస్టులోనైనా ఇస్తారా?

- పింఛన్ల కోసం వితంతువుల ఎదురుచూపు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం





గరుగుబిల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీవిత భాగస్వామ్య (స్పౌజ్) పింఛన్ల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. వచ్చేనెలలో అయినా పంపిణీ చేస్తారో లేదోనన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 1,521 మంది వితంతువులకు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేశారు. 2023, డిసెంబరు 1 నుంచి 2024, అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందిన లబ్ధిదారు జీవిత భాగస్వామిని స్పౌజ్ పింఛన్‌దారుగా గుర్తించారు. అయితే ఈ ఏడాది మే నెలలో వారికి పింఛన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉన్నా.. నేటికీ అందకపోవడంతో వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. పలుమార్లు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆగస్టులోనైనా పింఛన్లు అందించేలా చూడాలని వారు కోరుతున్నారు. వాస్తవంగా జూలై నెలలో ఆ పింఛన్ అందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు సచివాలయాల వారీగా నిధులు కేటాయించారు. అయితే జూలైలోనూ పంపిణీ కాకపోవడంతో 1,521 మందికి సంబంధించిన స్పౌజ్ పింఛన్ల నిధులు వెనక్కి మళ్లాయి.

ఇదిలాఉండగా ఆగస్టు నెలకు సంబంధించి 1,38,769 మంది వివిధ రకాల సామాజిక పింఛన్ దారులకు ఎన్టీఆర్ భరోసా కింద రూ. 59.21కోట్లు కానున్నాయి. స్పౌజ్ పింఛన్లకు నిధులు కేటాయించలేదు. దీంతో వితంతువుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎం.సుధారాణిని వివరణ కోరగా.. 'జీవిత భాగస్వామ్య పింఛన్లు పంపిణీకి ఎటువంటి ఆదేశాలు రాలేదు. జూలై నెలలో పంపిణీ చేయాల్సి ఉండగా మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. స్పౌజ్ పింఛన్లకు సంబంధించి అధికంగా వినతులు అందుతున్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆగస్టు నెలకు సంబంధించి గతంలో మంజూరైన పాతవారికే పింఛన్లు అందిస్తాం. నూతనంగా మంజూరైన వితంతువులకు మాత్రం ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే నగదు పంపిణీ చేస్తాం.' అని తెలిపారు.



బూర్జివలసలో గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి

కూటమితోనే సుపరిపాలన

- మంత్రి సంధ్యారాణి

8లో

మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించండి

- ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

6లో

పార్టీలకు అతీతంగా ఆదివాసీ దినోత్సవం

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ
- ఐటీడీఏలో గిరిజన సంఘాలతో ప్రత్యేక సమావేశం

6లో

అంతన్నారు.. ఇంతన్నారు

6లో

- గాలిలో వదిలేశారు
- మౌలిక సౌకర్యాల జాడే లేదు
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్వాసితుల గోడు

సాగునీరు అందక రైతుల ఇక్కట్లు

6లో

- తోటపల్లి ఎడమ కాలువ సబ్ చానల్ నుంచి శివారు పొలాలకు చేరని నీరు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ ఆదేశం



తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

సాలూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. బుధవారం తోణాం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. పాముకాటుకు గురైన విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని హెచ్ఎం రామారావు, వార్డెన్ లచ్చయ్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైనింగ్ బ్లాక్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. పాముకాటుకు గురైన విద్యార్థి క్షేమంగా ఉన్నాడన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. తోణాం పాఠశాల ఆవరణలో తుప్పలు, పొదలు తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆ ప్రాంతంలో లైటింగ్ పెంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఏ విద్యార్థి అస్వస్థతకు గురైన తక్షణమే ఆసుపత్రికి తలించాలని సూచించారు. తోణాంలో టాయిలెట్లు, డైనింగ్ హాల్ నిర్మాణానికి డీఏ జుగాలో కేంద్ర ప్రభుత్వ నిధులకు ప్రతిపాదనలు చేశామన్నారు.

చెరువులో దోమల నివారణ మందు పిచికారీ

పాచిపెంట: మలేరియా దోమల నివారణలో భాగంగా కొత్తవలస గ్రామంలో యాంటీలార్వల్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ ఆధ్వర్యంలో డ్రోన్ సాయంతో ఆ గ్రామ చెరువులో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యాలవలసలో ఏనుగుల గుంపు

6లో

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

8లో

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పాచిపెంట, జూలై30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తున్నామని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. బుధవారం కొత్తవలస వైద్య సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో సరిపడా మందుల నిల్వలు ఉంచుతున్నామన్నారు. జ్వరాలు ఉన్న ప్రతి ఒక్కరికీ రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాచిపెంట పీహెచ్‌సీని కూడా పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. సబ్ సెంటర్ల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అన్ని వేళలా అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.



కొత్తవలస ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఏవోబీలో రెడ్ అలెర్ట్

- ఏజెన్సీలో ముమ్మరంగా వాహన తనిఖీలు
- మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

8లో



సాలూరు మండలంలో కల్వర్టులను పరిశీలిస్తున్న భద్రత దళాలు

12,944 టన్నుల యూరియా సరఫరా

- అందుబాటులో నిల్వలు
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇప్పటివరకు 12,944 టన్నుల యూరియా సరఫరా అయిందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుకు దాదాపు 11,327 టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేశామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతేడాది ఖరీఫ్ సమయంలో 9,465 టన్నుల యూరియాను వాడగా, ఈ సీజన్ ఇప్పటి వరకు 9,954 టన్నులను వినియోగించినట్టు పేర్కొన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 625 టన్నులు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద 1440 టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 120 టన్నుల బఫర్ యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా జిల్లా అవసరమైన యూరియా రానుందని, ముందస్తుగా ఎక్కువ బస్తాలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. డీఏపీ, పొటాష్, సూపర్‌పాస్ఫేట్, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేదన్నారు. ఇప్పటివరకు 245 రైతు సేవా కేంద్రాల ద్వారా 7,235 టన్నులు, 22 సొసైటీల ద్వారా 1,369 టన్నుల యూరియా, డీఏపీ ఎరువులును పంపిణీ చేశామన్నారు. ఎరువులకు సంంధించి సూచనలు, మార్గదర్శకాలు, ఇతర సమాచారం కోసం ఈ 79894 34766 నెంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

పార్వతీపురంలో ఉన్న జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. ప్రాసెసింగ్ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రాసెసింగ్‌ను మంచి నాణ్యతతో చేపట్టాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. నాణ్యతా ప్రమాణాలు బాగుంటే మార్కెట్‌లో ఒక బ్రాండ్ క్రియేట్ అవుతుందన్నారు. తద్వారా మార్కెటింగ్‌కు పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ పరిశీలనలో డీఆర్వో కె.హేమలత తదితరులు ఉన్నారు.



జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్‌పీసీఐ చేయించుకోవాలి

అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి రైతులు బ్యాంకుల వద్ద తప్పనిసరిగా ఎన్‌పీసీఐ చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో దాదాపు 14 వందల మంది రైతుల వివరాలు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు.

అంతన్నారు.. ఇంతన్నారు

- గాలిలో వదిలేశారు
- మౌలిక సౌకర్యాల జాడే లేదు
- ఆర్అండ్ఆర్ కాలనీల నిర్వాసితుల గోడు


గూడెపువలస సమీప ఆర్ అండ్ ఆర్ కాలనీ

భోగాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి)

'మీకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. కాలనీని టౌన్‌షిప్‌లా తీర్చిదిద్దుతాం. అన్ని వసతులు కల్పిస్తాం. చెప్పిన ఏ సౌకర్యం లేక పోయినా అధికారులను నిలదీయొచ్చు'..ఇదీ ఆ గ్రామాలను ఖాళీ చేయకముందు అధికారుల మాట.

'గతంలో అధికారులు ఏం చెప్పారో మాకు తెలియదు. మాకు తెలిసిన పరిధిలో పనులు చేస్తాం'..ఇదీ ఇప్పటి అధికారుల మాట.

..భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా గ్రామాలను కోల్పోయి... ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలిపోయిన జనం సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో అనేక హామీలు గుప్పించిన అధికారులు ఇప్పుడు వాటి అమలు విషయమై స్థానికులు ప్రశ్నిస్తుంటే...తప్పించుకు తిరిగే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2,700 ఎకరాలు సేకరించింది. అందులో రెల్లిపేట, బొల్లింకలపాలెం, ముడసర్లపేట, మరాడపాలెం గ్రామాలకు చెందిన సుమారు 390 కటుంబాలు ఊళ్లను ఖాళీ చేయవలసి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు, అధికారులు అనేక పర్యాయాలు గ్రామాలను ఖాళీ చేయించడానికి విశ్వప్రయత్నాలు చేశారు. అయినా ఆ గ్రామాలను ఖాళీ చేసేందుకు సంబంధిత కుటుంబాలు అంగీకరించలేదు.


లింగాలవలస సమీప ఆర్అండ్ఆర్ కాలనీ

అధికారుల మాటలను నమ్మి..

ఆర్ అండ్ఆర్ ప్యాకేజీతో పాటు స్థలాలను అభివృద్ధి చేసి టౌన్‌షిప్‌లా తయారు చేసి... ప్రజల నివాసానికి ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పిస్తామని నాయకులు, అధికారులు ఆశలు కల్పించారు. గుడి, బడి వంటివి కూడా అందుబాటులోకి తెస్తామని భరోసా ఇచ్చారు. వీటన్నిటిపై ఆశ చూపి.. గ్రామాలను ఖాళీ చేయించేందుకు స్థానికులను ఒప్పించారు. ఇవన్నీ కార్యరూపం దాల్చుతాయనే ఆశతో.. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామాలు ఖాళీ చేసేందుకు ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తిగానే అంగీకరించారు. దీంతో రెల్లిపేట, బొల్లింకల పాలెంకు గూడెపువలసలో 29 ఎకరాలు, ముడసర్లపేట, మరాడపాలెం గ్రామాలకు లింగాలవలస సమీప కొండపై 25 ఎకరాలు కేటాయించారు. స్థలాలను అభివృద్ధి చేసి.. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించకుండా అసంపూర్తిగా వదిలేశారు. లింగాలవలస కొండపై గల ఆర్అండ్ఆర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించకుండా వదిలేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు. కాలనీ మధ్యలో పెద్దపెద్ద బండరాళ్లు తొలగించకుండా వదిలేశారు.

తాగునీరూ లేదు..

కొన్ని గృహాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామ పంచాయతీ భవనం నిర్మించలేదు, పోస్టాఫీసు, ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం నిర్మించలేదు. గూడెపువలస ఆర్అండ్ఆర్ కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మించకపోవడంతో పోస్టాఫీసు కోసం నిర్మించిన భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ భవనం, పశువైద్య శాల, రైతు భరోసా భవనం నిర్మించలేదు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, నాయకులు చెప్పిన మాటల కారణంగా గృహాలు ఖాళీ చేసి వచ్చి ఇక్కడ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో సౌకర్యాల కల్పనపై కవులవాడ సర్పంచ్ కొండపు ఎల్లయ్యమ్మ ఎమ్మెల్యే నాగమాధవి, మండల అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగితే గతంలో తాము లేమని సమాధానం ఇస్తున్నారని.. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిబంధనల ప్రకారం ఆర్అండ్ఆర్ కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

221 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్ జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని 221 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణంపై తన చాంబర్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. మరో 74 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఒకటి, రెండు రోజుల్లో వీటి అనుమతులు తెప్పిస్తామన్నారు. ఆగస్టు 20 నాటికి వీటిని కూడా పూర్తి చేయాలని చెప్పారు. 144 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు 20లోగా నీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ విమలరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత తదితరులు పాల్గొన్నారు.

దత్తత స్వచ్ఛందమే..

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అన్నది స్వచ్ఛందమేనని... ఏ ఉద్యోగిపైనా ఒత్తిడి తేవడం లేదని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. వివిధ మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరూ 67,066 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. మరో మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి వారి వాస్తవ అవసరాలను గుర్తించాలని ఆదేశించారు బంగారు కుటుంబాల దత్తత విషయంలో ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిడి లేదన్నారు. దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. పేదరికంలో ఉన్న వారిని వృద్ధిలోకి తేవడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి... స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చైతన్యపరచాలని సూచించారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి..

ఈ వర్షాకాలంలో ఎక్కడా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే ఉపేక్షించబోమని చెప్పారు. తరచూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని, ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని చెప్పారు. కాలువల్లో ఎక్కడా తాగునీటి పైపులైన్లు లేకుండా చూడాలని ఆదేశించారు పారిశుధ్యం, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రతి గ్రామానికి మండల స్థాయిలో ప్రత్యేకాధికారిని నియమించాలని చెప్పారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ..

ఆగస్టు 1న ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీల నేపథ్యంలో కొత్తగా వచ్చిన వారికి లబ్ధిదారుల ఇళ్లను గుర్తించడం కష్టమయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎంల సాయంతో తీసుకుని పింఛన్లు అందించాలన్నారు. ప్రత్యేకాధికారులు ఆ రోజున గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు.

ఎరువుల కొరత లేదు..

జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. అవసరానికి తగిన యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. సాధారణ యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించాలని సూచించారు. జిల్లాలో నానో యూరియా 12,000 బాటిళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయనున్న నేపథ్యంలో రైతులు బ్యాంకు ఖాతాల మ్యాపింగ్‌ను పూర్తి చేయాలన్నారు. మరో 12 వేల మందికి ఈకేవైసీ పూర్తి కావలసి ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, జెడ్పీ సీఈవో సత్యనారాయణ, జిల్లా వైద్యాధికారి జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పార్టీలకు అతీతంగా ఆదివాసీ దినోత్సవం

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సీతంపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిద్దామని పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై గిరిజన సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది ఆనాటి టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ఈ పండుగను అందరం కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం గిరిజన సంఘాల పెద్దలు ఇచ్చిన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఆదివాసీ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ పూర్తి సహకారం అందించాలని పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఏపీవో జి.చిన్నబాబు, పాలకొండ డీఎస్పీ రాంబాబు, టీడబ్ల్యు ఈఈ కుమార్, పీహెచ్‌వో ఆర్వీ గణేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన రావు, ఏపీడీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం మధ్యవర్తిత్వం అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఎం.బబిత పిలుపునిచ్చారు. బుధవారం కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనే ప్రక్రియ చాలా సులువైందని, ఖర్చు లేనిదని తెలియజేయాలన్నారు. దేశ వ్యాప్తంగా 90 రోజుల పాటు ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా మనోవర్తి కేసులు, ప్రమాద బీమా, గృహహింస, చెక్‌బౌన్స్, వాణిజ్య పరమైన తగాదా కేసులను సులువుగా ఈ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఇందులో మధ్యవర్తులు, న్యాయమూర్తులు ముఖ్య భూమిక పాత్రను పోషిస్తారని చెప్పారు. న్యాయమూర్తులు కేసుల పరిష్కారానికి తోడ్పాటును అందించాలని సూచించారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

విజయనగరం క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా హేయమైన చర్యని... ఇది వ్యవస్థీకృత నేరమని... ఈ దోపిడీని అంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా మహిళా ప్రాంగణంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణా బాధితులకు రక్షణ, నష్టపరిహారం, పునరావాసంతో పాటు తగిన న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థతో పాటు పోలీసు యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల అక్రమ రవాణాపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు గోవిందరావు, ఐసీడీఎస్ పీడీ విమలాకుమారి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాదరావు, సీడబ్ల్యూసీ చైర్మన్ హిమబిందు, డీసీహెచ్ఎస్ బీహెచ్ లక్ష్మి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


హాజరైన పోలీసు అధికారులు

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శక సేవలు

- నేటి నుంచి నగర పాలక సంస్థ పరిధిలో అమలు
- నకిలీ పత్రాలు, భూ వివాదాలకు స్వస్తి
- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర


జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర

విజయనగరం దాసన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నగర పాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలు, అపార్టుమెంట్లు, ఇళ్లకు పారదర్శక సేవలు అందిస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతకు తోడుగా పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర- 2047 వైపు అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 17 నగరపాలక సంస్థ కార్యాలయాల్లో పారదర్శక సేవలు అందించేందుకు ప్రణాళిక రూపొందించిందన్నారు. దీనిలో భాగంగా రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ అయిపోతుందన్నారు. దీంతో నగరపాలక సంస్థ కార్యాలయాలకు వెళ్లి మ్యుటేషన్ చేసుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. ఆస్తి, పన్నుల వివరాలు, డేటా బేస్‌లో నిక్షిప్తమై పారదర్శకత పెరుగుతుందన్నారు. సరళంగా, వేగంగా సేవలు పొందవచ్చునని తెలిపారు. నకిలీ పత్రాలు, భూ వివాదాలకు స్వస్తి చెప్పవచ్చునన్నారు. నీరు, డ్రైనేజీ, నివాస పన్నుల వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సమీపంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, వార్డు, డివిజన్ సచివాలయాలను సందర్శించి నివృత్తి చేసుకోవచ్చునని జిల్లా రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

బియ్యాలవలసలో ఏనుగుల గుంపు

కురుపాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బియ్యాలవలస పరిసర ప్రాంతాల్లో అరటి, చెరకు, పామాయిల్, మామిడితోటల్లో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. వివిధ పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రామాల రైతులు, ప్రజలు మాట్లాడుతూ ఏనుగుల సమస్య అనేది దీర్ఘకాలికంగా ఉందని, అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు నాశనం చేయడమే కాక.. రైతుల ప్రాణాలు కూడా తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి ఏనుగులను ఈ పరిసర ప్రాంతాల నుంచి దూరంగా తరలించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


తోటలో ఉన్న ఏనుగులు

సాగునీరు అందక రైతుల ఇక్కట్లు


కిమ్మిలో ఎండిపోయిన పంట పొలం

వీరఘట్టం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ రైతులకు సాగునీరు అందక ఇక్కట్లు పడుతున్నారు. వరి నారుమడులు వేసి 30 రోజులు దాటుతున్నా నేటికీ దమ్ము కూడా చేయలేదు. ఏటా ఈ మూడు గ్రామాల రైతులకు కష్టాలు తప్పడం లేదు. తోటపల్లి ఎడమ కాలువ సబ్ ఛానెల్ నుంచి సాగునీరు ఈ గ్రామాలకు అందుతుంది. శివారు గ్రామాలు కావడంతో ఈ ప్రాంత పంట పొలాలకు నీరు అందడం లేదు. మోటార్లు ఉన్న రైతులు మాత్రమే వరి నాట్లు సకాలంలో వేయగలగుతున్నారు. మిగిలిన వారు సాగునీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. తమ గ్రామాలకు సాగు నీరందేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

దమ్ములే లేవు..

వరినారు వేసి 30 రోజులు అవుతుంది. సాగునీరు అందక దమ్ము చేపట్టలేదు. అధికారులు చొరవ తీసుకొని సాగునీరు అందేలా చూడాలి.

-మచ్చ సత్యంనాయుడు, రైతు

16 నుంచి జన్మాష్టమి వేడుకలు

విజయనగరం కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆగస్టు 16 నుంచి 20 వరకూ నిర్వహించనున్నట్టు ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు వి.శంకరరావు తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలను జిల్లా కేంద్ర ంలోని గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు నెల్లిమర్ల, గజపతినగరం, రాజాం, బొద్దాం, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

●రాజాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ తెలిపారు. రాజాం మునిసిపాలిటీలోని తెగవీధిలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు అధ్యక్షతన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

●నెల్లిమర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు, మల్యాడ, తమ్మాపురంల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిది గేదెల రాజారావు, పార్టీ నాయకులు పంచాది సూరినాయుడు, పోతల రాజప్పన్న, పంచాది జగన్, గురాన రామారావు, లెంక సన్యాసిరావు, మొంగం శ్రీను, లంక పైడినాయుడు, పైడి మల్లేష్, పున్నాన రమణ, పాపినాయుడు పాల్గొన్నారు.


మెరకముడిదాం: వూటపల్లిలో కరపత్రం అందజేస్తున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు

●మెరకముడిదాం,జూలై 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని వూటపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగుకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, తాడ్డి చంద్రశేఖరరెడ్డి, ఆనంద్, చల్లా శ్రీరామ్ పాల్గొన్నారు.

● జిల్లావ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు


రాజాం: మునిసిపాలిటీ పరిధిలోని తెలగవీధిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

గోడలు బీటలువారి..శ్లాబులు పెచ్చులూడి



వెలుగు కార్యాలయంలో పైకప్పు నుంచి పెచ్చులూడుతున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాల గోడలు బీటలు వారాయి. శ్లాబులు పెచ్చులూడి రాలిపడుతున్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు కావడంతో శిథిలావస్థకు చేరాయి. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన వ్యవసాయ, వెలుగు, మండల విద్యా వనరుల కేంద్రం తదితర కార్యాలయాల భవనాలకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదకర పరిస్థితిలోఉన్నాయి. కనీస నిర్వహణ లేకపోవడంతో బీటలు ఏర్పడి, పగుళ్ల దేరి దెబ్బతి న్నాయి. వర్షంకురిస్తే పైకప్పులు నుంచి కారిపోతున్నాయి. దీంతో కార్యాలయాల్లో నీరుచేరడంతో రికార్డులు తడిచిపోతున్నాయి. విద్యా వనరుల కేంద్రం ఏ క్షణమైనే కూలిపోయే ప్రమాదముందని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వ్యవసాయ కార్యాలయం పైఅంతస్తు వెళ్లడానికి నిర్మించిన మెట్లు పూర్తిగా పాడయ్యాయి. వెలుగు కార్యాలయంలో పైకప్పు నుంచి ఇటీవల పెచ్చులూడి కింద పడినట్లు సిబ్బంది తెలిపారు. కాగా వెలుగు కార్యాలయం భవనం దుస్థితిని అధికారులకు తెలియజేశామని ఏపీఎం పి.భాగ్యలక్ష్మి తెలిపారు.

● బొబ్బిలిలో వర్షాలకు కారిపోతున్న ప్రభుత్వ కార్యాలయాలు


వ్యవసాయ కార్యాలయం వద్ద మెట్లు పెచ్చులూడుతున్న దృశ్యం

వేర్వేరు చోట్ల చెరువుల్లో పడి ఇద్దరి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.ఈ మేరకు ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

గంట్యాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరానికి చెందిన కొల్లి సూరిదేముడు (41) చెరువులో పడి బుధవారం మృతి చెందాడు. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ కథనం మేరకు.. సూరిదేముడు అయ్యన్న బంద చెరువుకు బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో చెరువులో కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడు. సూరిదేముడుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నాయి. ఈవిషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి పంచానామ చేసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

ఎంఆర్‌నగరంలో..

పార్వతీపురం రూరల్,జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఆర్ నగరంలో చిన్నమనాయుడు చెరువులో బుధవారం ప్రమాదవశాత్తూ పడి అదే గ్రామానికి చెందిన సింగారెడ్డి రమేష్ (40) మృతిచెందాడు. మృతుడికి భార్య శకుంతలతో పాటుకుమార్తె ఝాన్సీ ఉన్నారు. ఈఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు.

ఏడుగురు విద్యార్థులకు గాయాలు

● ఆటోను ఢీకొన్న ఘటనలో తప్పిన పెనుప్రమాదం

భోగాపురం, జూలై30(ఆంధ్రజ్యోతి): భోగాపురం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. విద్యార్థులతో వెనుక నుంచి వెళ్తున్న ఆటో మరో ఆటోను ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు... డెంకాడ మండలంలోని అక్కివరం సమీపంలోగల ఏపీ మోడల్‌స్కూల్ అదే మండలంలోని శింగవరం, నాతవలసకు చెందిన పలువురు విద్యార్థులు చదువుతున్నారు. వీరు ప్రతిరోజూ ఆటోపై నాతవలస, భోగాపురం మీదుగా పాఠశాలకు వెళ్తుంటారు. బుధవారం కొందరు విద్యార్థులు ఆటోలో వెళ్తున్నారు. భోగాపురం స్టేట్ బ్యాంకు సమీపంలో ముందు వెళ్తున్న ఆటో సడన్‌గా పక్కకు తిరిగింది. దీంతో వెనుకన విద్యార్థులతో వెళ్తున్న ఆటో సడన్ బ్రేక్ వేసి ముందున్న ఆటోని ఢీకొంది.దీంతో ఆటోలో ఉన్న విద్యార్థులు ఉలిక్కిపడి భయాందోళనలకు గురయ్యారు. ఎం.సాధ్విక, ఆర్.రోషిణి, ఎం.రిషి, బి.కుసుమ, ఎల్.గ్రీష్మ, జి.అభిషేక్, ఎన్.యామినిలకు గాయాలయ్యాయి. అనంతరం విద్యార్థులు పాఠశాలకు వెళ్లిపోయారు. గాయాలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులను చూసిన ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు విద్యార్థులకు సపర్యలు చేసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి చికిత్స నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తీసుకెనుళ్లారు. కాగా ఈ విషయంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

మత్సవానిపాలెంలో ఇరువర్గాల కొట్లాట

పూసపాటిరేగ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెర్ల పంచాయతీ పరిధిలోగల మత్సవానిపాలెంలో మంగళవారం సాయంత్రం ఇరు వర్గాల మధ్య కొట్లాట నేపథ్యంలో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ దుర్గాప్రసాద్ కథనం మేరకు.. కోళ్లవారి కుటుంబానికి చెందిన పెళ్లి విషయంపై గ్రామంలో పళ్ల లక్ష్మణరావు, కోళ్ల అప్పలనర్సయ్య కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పళ్ల సందీప్‌ను మత్సవానిపాలెం గ్రామానికి సమీపంలో గల ఐస్‌ఫ్యాక్టరీ వద్ద కోళ్ల కుటుంబానికి చెందిన కోళ్ల వెంకటేష్‌తోపాటు పలువురు దాడిచేశారు.సందీప్ అక్కడి నుంచి తప్పించుకొని గ్రామానికి చేరుకున్నాడు. అనంతరం గ్రామంలో ఇరువర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో గాయపడిన వారిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి సిబ్బంది అందజేసిన సమాచారం మేరకు కేసును నమోదుచేశారు. ప్రస్తుతం బాధితులు విజయనగరం ప్రభుత్వాసుపత్రితోపాటు, ప్రైవేటు ఆశుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాయంత్రం ఆవిష్కరణ.. రాత్రి ధ్వంసం

● తాడిపూడిలో ఎన్‌టీఆర్ విగ్రహం ధ్వంసంపై టీడీపీ కార్యకర్తల విచారం

గుర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడిలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి పాక్షికంగా విగ్రహంలోని ముక్కు భాగాన్ని ధ్వంసం చేయడంతోపాటు విగ్రహం కూడా కదిలించారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న కొందరు వ్యక్తులు అలికిడి వల్ల పారిపోయినట్లు తెలిసింది. మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కళావెంకటరావు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించిన విషయం విదితమే. విగ్రహం ధ్వంసంపై ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలంలో క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ తో దర్యాప్తు నిర్వహించారు. ధ్వంసంచేసిన వారిని పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో ఎటువంటి విభేదాలు లేవని, అందరు కలిసికట్టుగా ఉన్నామని ఇది ఎవరు తెలియని వ్యక్తులు చేసి ఉంటారని తెలిపారు. విగ్రహం ధ్వంసంపై మహిళలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన దుండగులను శిక్షించాలని పోలీసులను కోరారు.


విగ్రహం ముక్కు భాగం వద్ద ధ్వంసంచేసిన దృశ్యం

హెచ్‌పీసీఎల్ పైపులైన్‌కు సహకరించండి

లక్కవరపుకోట, జూలై 30(ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ పైపులైన్ ఏర్పాటుకు రైతులు సహకరించాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్ కోరారు. బుధవారం లక్కవరపుకోటలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు సమక్షంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాసాగర్ మాట్లాడుతూ గతంలో ఏర్పడిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పైపులైన్‌కు సమాంతరంగా హెచ్‌పీసీఎల్ లైన్ వెళ్తోందని తెలిపారు. దీంతో రైతులు అభ్యంతరం వ్యక్తంచేశారు. తాము అభివృద్ధికి ఆటకంకం కాదని, నష్టపరిహారం విషయంలో రాజీ పడేదిలేదని స్పష్టంచేశారు. విశాఖ నుంచి రాయపూర్ వెళ్తున్న హైవే రోడ్డుకు ఇచ్చినట్లు పరిహారం ఇవ్వాలని కోరారు. లేదంటే భూములిచ్చేది లేదని పేర్కొన్నారు. తామరాపల్లి, శ్రీరాంపురం, ఆర్జీపేట, రంగాపురం,రంగరాయపురం, ఖాసాపేట, కొట్యాడ, తలారి గ్రామాల మీదుగా పైపులైన్ వెళ్తున్నట్లు సుధాసాగర్ పేర్కొన్నారు. రైతులు పలు డిమాండ్లను డిప్యూటీ కలెక్టర్ ముందుఉంచారు. సమావేశంలో హెచ్‌పీసీఎల్ మేనేజర్ టి.లక్షణ్, సీఐటీయూ నాయకులు తరిని వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్నాథ ఆలయ భూముల వేలం

మెరకముడిదాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భాంలో జగన్నాథస్వామి ఆలయానికి సంబంధించి ఆక్రమణలో ఉన్న భూములను బుధవారం టెండర్ కం వేలం వేసినట్లు గజపతినగరం ఆలయాల సంస్థ కార్యనిర్వహణాధికారి కె. శ్రీరామ్ తెలిపారు. గర్భాంలో స్థానిక వీఆర్వో పి.తిరుపతిరావు ఆధ్వర్యంలో వేలం పాట జరిగిందని చెప్పారు.

శక్తి వారియర్స్ బృందాల ఏర్పాటు చేయాలి

కొత్తవలస, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతి తరగతికి సంబంధించి శక్తి వారియర్స్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు తెలిపారు. బుధవారం కొత్తవలసలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల భద్రతపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

పోరలి పీఏసీఎస్ అధ్యక్షురాలిగా అలివేణి

దత్తిరాజేరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పోరలి పీఏసీఎస్ అధ్యక్షురాలిగా వంగపండు అలివేణి, మంత్రి రామారావు, పొడుపురెడ్డి తిరుపతి డైరెక్టర్లగా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్తిబాబు, పెద్దింటి మోహన్, బెజవాడ రాజేశ్వరి పాల్గొన్నారు.

3న చదరంగం పోటీలకు ఎంపికలు

విజయనగరం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కొత్త అగ్రహారంలో జిల్లాస్థాయి యు-19 బాలబాలికల చదరంగం పోటీల ఎంపికలు ఆగస్టు మూడో తేదీన జరుగుతాయని చదరంగం (శ్రీచెస్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంకారావు తెలిపారు. పేర్లను ఆగస్టు రెండో తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లను నమోదు చేసుకోవడానికి 8520886564 నెంబరును సంప్రదించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్.కోట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం కావడంతో వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొట్టాం పీహెచ్‌సీ సీహెచ్‌వో వేణుగోపాలరావు కోరారు. బుధవారం మండలంలోని చుక్కవానిపాలెంలో వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమణమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పరిశీలన

భోగాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గాయిత్రి సూచించారు. బుధవారం రామచంద్రపేట పంచాయతీలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు.

బంగారు కుటుంబం దత్తత

నెల్లిమర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివకు బంగారయ్య మార్గదర్శిగా ఉండి ఓ బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. విజయనగరంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన సిబారిక సంతోషి కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్టు ఆయన బుధవారం విలేకరులకు తెలిపారు. ఆ బంగారు కుటుంబ యజమాని సిబారిక కుమార్, సంతోషి, కూలి పనులు చేసి పిల్లలు నవ్య, నిఖిల్‌లు 6,8 తరగతులు చదువుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ ఆదాయం పెంచాలి

చీపురుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వారికి సిబ్బంది స్నేహ భావంతో సేవలందజేయాలని జిలా రిజిస్ట్రార్ టి. ఉపేంద్ర సూచించారు. బుధవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసమైన సేవలందజేస్తూ, ప్రభుత్వానికి రెవెన్యూ పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి, కార్యాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ టీవీవీఎస్‌కే లక్ష్మణరావు, సీనియర్ అసిస్టెంట్ బంగార్రాజు తదితరులు ఉన్నారు.

చోడవరంలో అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

గుర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడవరంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బంగారమ్మపై బుధవారం గరివిడి ప్రాజెక్టు ఐసీడీఎస్ అధికారి ఆరుద్ర విచారణ నిర్వహించారు. బంగారమ్మ నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిగింది. అలాగే తన విధులకు ఆటంకంకలిగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారనిబంగారమ్మ కొంతమంది వ్యక్తులపై ఫిర్యాదు చేయడంతో విచారణ చేశారు. అనంతరం సమాచారం జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆరుద్ర తెలిపారు.

యాజమాన్యం ఇచ్చిన హామీ నెరవేర్చాలి


నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, జూలై30 (ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యానికి 18 ఏళ్ల కిందట భూములిచ్చి మోసపోయిన తమకు న్యాయం చేయాలని బొడ్డవర నిర్వాసితులు కోరారు.ఈ మేరకు బుధవారం నిర్వాసితులు బొడ్డవర వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమభూములకు సంబందించిన సర్వేనెంబర్లు ప్రదర్శించారు. యాజమాన్యం ఇచ్చిన ప్రతి హామీ నేరవేర్చాలని కోరారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సంతకవిటి, జూలై 30(ఆంధ్రజ్యోతి); అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ శారదాదేవి కోరారు. బుధవారం సంతకవిటిలో అధికారులతో ఎరువులు, సీజనల్ వ్యాధులు , పి-4 సర్వేపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఏపీవో హరినాథ్, వైద్యాధికారి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

50 కుటుంబాలు జనసేనలో చేరిక


కండువాలు వేసి జనసేనలోకి ఆహ్వానిస్తున్న నాగమాధవి

భోగాపురం, జూలై30(ఆంధ్రజ్యోతి):ముంజేరు సమీపంలోగల జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో కొండరాజుపేట, గట్లాం గ్రామాలకుచెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి జనసేనలో చేరాయి.వార్డు సభ్యులు ఆదినారాయణరెడ్డి, బి.యర్రయ్యరెడ్డి, గుడిమెట్ల అప్పలరాజు చేరిన వారితో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, పాలుశ్రీను, తదితరులు పాల్గొన్నారు. కాగా ముంజేరు జనసేనకార్యాలయంలో ఆ గ్రామానికి చెందిన పెద్ది ఉమకి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి రూ.1.95 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వంద నాల రమణ పాల్గొన్నారు.

సాగు నీరు తక్షణమే అందించండి

● చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

రాజాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు తక్షణమే అందించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదేశించారు. బుధవారం రాజాం క్యాంపు కార్యాలయంలో తోటపల్లి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీపురుపల్లి, నెలిమర్ల, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని చివరి సాగు భూమి వరకు తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించాలన్నారు. రైతులకు సమయానికి సాగునీరందించే బాధ్యత అధికారులపై ఉందని, కలెక్టర్, తోటపల్లి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. లస్కర్లను నియమించాలని అధికారులకు సూచించారు. నెలిమర్ల నియోజకవర్గంలో సాగుభూములకు ఆగస్టులో నీరందించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ అప్పలనాయుడు,డీఈఈలు మీసాలహరికృష్ణనాయుడు, కె.సుచిత్ర, డి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని టీడీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పంపిణీ చేశారు. ఒమ్మి గ్రామానికి చెందిన బురాడ పుణ్యవతికి రెండు లక్షల 17, 790, వంగర మండలం మడ్డువలస గ్రామానికి చెందిన తుర్ల గంగులకు రూ.73వేల 300 చెక్కును. అందజేశారు. అనంతరం తెలగవీధికి చెందిన పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాషరావు ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గురవాన నారాయణరావు, సుమల వెంకటమన్మథరావు, గట్టి భాను, శాసపు రమేష్‌కుమార్, దుప్పపూడి శ్రీను, శాసపు రాజేష్‌కుమార్, ముగడ శ్రీను,వల్లూరు గణేష్ పాల్గొన్నారు. అలాగే బలిజిపేట మండలంలోని గళావల్లికి చెందిన ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయవాది మామిడి రామారావు కుటుంబానికి చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.6 లక్షల 50 వేలు అందజేశారు. ఇటీవల విశాఖలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో కుటుంబ సభ్యులకు ఆ చెక్కును అందజేశారు.

రైతుల అభివృద్ధికి కృషి

● విజయనగరం ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

విజయనగరంరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా గ్రామస్థాయిలో రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు చెప్పారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ఈసందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను పంపిణీ చేయడమే కాకుండా రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కమిటీ ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ చంద్రినాయుడు, పాలకవర్గ సభ్యులు, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరక్టరు కిరణ్ కుమార్, డీసీసీబీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగార్జున, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, విజ్జపు ప్రసాద్, పి.రాజేష్‌వర్మ, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, రాజేష్‌వర్మ, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, తెలుగుయువత నాయకులు పొగిరి పైడిరాజు, మాతా బుజ్జి, తెలుగుమహిళా నాయకులు పత్తిగిల్లి సూర్యకుమారి, కర్రోతు రాధామణి, కొర్నాన రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


చీపురుపల్లి:దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, మండలప్రత్యేకాధికారి ఎం.అన్నపూర్ణ హెచ్చరించారు. బుధవారం మండలంలో కంటకాపల్లి తదితర గ్రామాల్లో ఎరువులు విక్రయిస్తున్న షాపులు, నిల్వఉంచే గొడౌన్‌లను ఏవో రాంప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు ఎంత అమ్మకాలను చేశారన్న విషయాన్ని స్టాక్ రికార్డులో నమోదు చేయాలని కోరారు.

●చీపురుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో తహసీల్దారు డి.ధర్మరాజు, ఏవో సూర్యకుమారి తదితరులు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

రాజాం జూలై 30 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆరోగ్యంతోనే ఆయుష్మాన్ భారత్ సాకారం కాగలదని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి గట్టి భార్గవి తెలిపారు. బుధవారం గురవాం కస్తూరిబా గాంధీ విద్యాలయం ఆవరణలో మాతృ శిశు,ఆరోగ్య మాసంలో భాగంగా రాజాం టౌన్ రోటరి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు విద్య, ఆరోగ్యం, పోషణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు.కార్యక్రమంలో రోటరిక్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, కార్యదర్శి సప్పటి వసంతరావు, ప్రత్యేకాధికారి పి.సావిత్రి, ఆరోగ్య కార్యకర్త బి.చిట్టితల్లి పాల్గొన్నారు,

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్లు


కమిషనర్ నల్లనయ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సభ్యులు

విజయనగరం రింగురోడ్డు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరం స్టాండింగ్ కమిటీ ఎన్నికకు బుధవారం చివరి రోజు ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఎస్‌వీవీ రాజేష్, అల్లు చాణక్య, సుంకరి నారాయణస్వామి, జీవీ రంగారావు, రేగాన రూపావతి దేవి కమిషనర్ నల్లనయ్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు.నామినేషన్ వేసిన వివరాలతో కూడిన పత్రాన్ని నోటీసు బోర్డులో అతికించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దత్తిరాజేరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని 33కేవీ కోమటిపల్లి ఫీడర్ పోరలి నుంచి కోమటిపల్లి వరకు లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించే పనిలో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకువిద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ఇంజనీర్ బి.రఘు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శివకుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రజలు సహకరించాలని కోరారు.

●గంట్యాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో గల రామవరం రూరల్ ఫీడర్ మీద ఉన్న చెట్లు కొమ్మలను తొలగించనున్నారు.ఈ నేపథ్యంలో బుడతనాపల్లి, చినమానాపురం గ్రామాలకు గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు త్రినాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గందరగోళానికి తెర!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారు. గ్రామ, సచివాలయ కార్యదర్శులు ,ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల అధికారులు మార్గదర్శులుగా తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. కాగా సరైన అవగాహన లేక కొన్ని మండలాల్లో ఎంఈవోలు తప్పనిసరిగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని టీచర్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఈ పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి ' ప్రధాన సంచికలో కథనం ప్రచురించడంతో ప్రభుత్వం స్పందించింది. బంగారు కుటుంబాల దత్తత అంశం స్వచ్ఛందమేనని ప్రకటించింది. దీంతో విద్యాశాఖలో కొంతమంది అధికారులు తమ మౌఖిక ఆదేశాలను వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం ఎటువంటి ఒత్తిడి లేకుండానే ఉపాధ్యాయులు పీ4లో భాగంగా మార్గదర్శులుగా నమోదు చేసుకుని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారు.

ఆదేశాలు ఇవ్వలేదు

ఉపాధ్యాయులు తప్పనిసరిగా మార్గదర్శులుగా ఉండాలని ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వారి ఇష్ట ప్రకారమే బంగారు కుటుంబాలను దత్తత తీసు కోవచ్చు. ఈ విషయంలో విద్యాశాఖ ద్వారా ఎవరిపైనా ఎటు వంటి ఒత్తిడి లేదు.

- బి.రాజ్‌కుమార్, డీఈవో, పార్వతీపురం మన్యం

ఆర్టీవో అధికారుల దాడులు

బెలగాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురంలో పలుచోట్ల అసిస్టెంట్ ఎంవీఐ కాశీరాం బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలను పాటించని 10 ఆటోలపై కేసులు నమోదు చేశారు. వాటికి రూ. 50 వేల జరిమానా విధించారు. మూడు వాహనాలను ఏఎంవీఐ సీజ్ చేశారు.

జగనన్న లేఅవుట్‌లో వసతులు కల్పించండి

సాలూరు, జూలై30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని కౌన్సిలర్లు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో అజెండాలోని అంశాలను మున్సిపల్ అధికారులు చదివి వినిపించారు. పలు అంశాలకు మున్సిపల్ కార్యవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణానికి సమీపంలో ఉన్న నెలిపర్తి జగనన్న లేఅవుట్‌లో హౌసింగ్ లబ్ధిదారులకు వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో పలువురు అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తాలాడలో 70 మందికి వైద్య పరీక్షలు

భామిని, జూలై30 (ఆంధ్రజ్యోతి): బాలేరు పీహెచ్‌సీ పరిధిలోని తాలాడ లో బుధవారం డాక్టర్ జి.శివకుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 97 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఏడుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు.వారికి మందులుఅందజేశారు. ఈ సందర్భంగా ఇంటింటా జ్వరాలపైసిబ్బంది సర్వేనిర్వహించారు. దోమతెరల వాడకంపై అవగాహన కల్పించారు. శిబిరంలో వైద్య సిబ్బంది, ఈవో, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సీతంపేట రూరల్, జూలై30 (ఆంధ్రజ్యోతి): పొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.పాలకొండ అగ్నిమాపకశాఖ అధికారి జామి సర్వేశ్వరరావు విద్యార్థులకుఅవగాహన కల్పించారు. చెరువులు, నదులు, జలపాతాలు, సముద్రాల్లో ప్రమాదం సంభవించినప్పుడు ఎలా సమయస్ఫూర్తిగా తప్పించుకోవాలనే అంశాలపై విద్యార్థులకుఅవగాహన కల్పించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

కురుపాం, జూలై30 (ఆంధ్రజ్యోతి):స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం పారాలీగల్ వలంటీరు అంధవరపు కోటేశ్వరరావు చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలునడుపరాదని, తోటి విద్యార్థుల పట్ల సక్రమంగా ప్రవర్తించాలని సూచించారు.విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌ల తనిఖీ

వీరఘట్టం, జూలై30 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను బుధవారం అధికారులు బృందం తనిఖీలు చేపట్టింది. తహసీల్దార్ సాయి కామేశ్వరరావు, ఎస్ఐ కళాధర్, పీహెచ్‌సీ వైద్యులు ప్రదీప్‌కుమార్.. వారి లైసెన్స్‌లు, మందులు, రికార్డులు పరిశీలించారు.

మూలకు చేరిన చెత్త వాహనాలు


నిరుపయోగంగా ఉన్న వాహనాలివే..

పార్వతీపురం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో చెత్త తరలింపు వాహనాలు మూలకు చేరాయి. వాస్తవంగా మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో చెత్త తరలించేందుకు తగినంత కార్మికులతో పాటు వాహనాల లేవు. ఇక్కడ మున్సిపాలిటీకి రెండు చెత్త తరలింపు వాహనాలు (కాంపాక్టర్) ఉండేది. అవి మరమ్మతుకు గురవ్వడంతో రూ.1.70 లక్షలు మేర వెచ్చించి విశాఖపట్నంలో మరమ్మతులు చేయించారు. అది కొద్ది నెలల కిందటి వరకూ రెండు వాహనాలను వినియోగించేవారు. ఏమైందో ఏమె అందులో ఓ వాహనం మొరాయించింది. దాంతో ఒకే కాంపాక్టర్ వారికి దిక్కైంది. నెలరోజుల కిందట మిగిలిన ఆ ఒక్క వాహనం కూడా మరమ్మతులకు గురైయ్యింది. దాంతో తామేమి చేయలేమని, మున్సిపల్ ప్రజారోగ్యశాఖాధికారులు చేత్తులెత్తేశారు. అయితే కాంపాక్టర్ వాహనాలకు నిధులు మంజూరు చేయాల్సిన ఇంజనీరింగ్ అధికారులు మిన్నకున్నారు. దీంతో మున్సిపాలిటీలో పరిధిలో రోజు సుమారు 10 టన్నుల చెత్త తరలింపునకు పారిశుధ్య కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

● ఈ విషయమై సంబంధిత ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావును వివరణ కోరగా ఒక్క వాహనాన్ని మరమ్మతు చేయించేందుకు రూ.లక్ష మేర ఖర్చు అవుతుందని అంచనా వేయించామన్నారు. సంబంధిత మెకానిక్ విశాఖపట్నం వస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

కూటమితోనే సుపరిపాలన

రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


చిన్నారులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూలై30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారం బూర్జివలసలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణిని గిరిజనులు ఘన స్వాగతం పలికారు. గిరిజనులతో కలిసి మంత్రి థింసా నృత్యం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామం అభివృద్ధి బాటలో నడవాలని, ప్రతీ కుటుంబం సురక్షితంగా జీవించాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండలంలోని తురాయిపాడు బీటి రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు, ములక్కావలస రోడ్డుకు రూ.3.30 కోట్లు, సాలూరు నుంచి పూడిజెన్ వయా దుగ్గిసాగరం రోడ్డుకు రూ.3 కోట్లు, గుర్ల కొత్తవలస ఆశ్రమ పాఠశాలకు రూ.5.72 కోట్లు, మామిడిపల్లి ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరైనట్టు ఆమె వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, పార్టీ సీనియర్ నాయకుడు బసవయ్య, ఎంపీటీసీ సభ్యురాలు అప్పికొండ రమాదేవి, అప్పలస్వామి, మచ్చ శ్యామ్‌ప్రసాద్, శ్రావణి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునే పార్టీలకు భవిష్యత్ లేదు..

● మక్కువ రూరల్, జూలై30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకునే రాజకీయ పార్టీలకు, నాయకులకు భవిష్యత్ ఉండదని గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. బుధవారం మార్కొండపుట్టిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సంధ్యారాణి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఇది చూసి ఓర్వలేని జగన్..పార్టీ నాయకులను ఇంటింటికీ పంపి దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. వాటిని ప్రజలే తిప్పికొట్టాలన్నారు. మద్యం కుంభకోణంలో జగన్ ఏ క్షణాన్నైనా జైలుకు వెళ్లకతప్పదన్నారు. సంధ్యారాణి వెంట టీడీపీ నాయకుడు బొంగు వాసుదేవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలరావు తదితరులున్నారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్టు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం కోటిపాం అంతర్రాష్ట్ర రహదారి నుంచి సత్యనారాయణస్వామి దేవస్థానం వరకు రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ఆమె ప్రారంభించారు. అనంతరం కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం మెనూ పరిశీలించారు. అనంతరం కోటిపాంతో పాటు గుమడ, సీతామాంబపురం గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై కరప్రతాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శేఖర్ పాత్రుడు, సుదర్శనరావు, నాగిరెడ్డి, మధుసూదనరావు, గార గౌరీశంకర్, తెంటు శ్రీకర్, డి.సురేష్, శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

పాలకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని శక్తిటీం ఇన్‌చార్జి, ఏఎస్ఐ ఆర్.సురేష్‌కుమార్‌హితవు పలికారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ-దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. ఈ సమయంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం శక్తియాప్, 1930, 1098, 112 తదితర టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి వెలమల అప్పారావు, ఉపాధ్యాయులు వెంకటరమణ, విజయరాజ్, మాణిక్యరాజ్ తదితరులున్నారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించండి


వైద్య బృందంతో సమీక్షిస్తున్న డా.జగన్మోహన్

బెలగాం, జూలై30 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో శారీరక, మానసిక లోపాలను గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యమని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన రావు అన్నారు. బుధవారం జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం వైద్య బృందంతో ఆయన సమీక్ష నిర్వహించారు. లోపాలు ఉన్న పిల్లలకు ఎటువంటి చికిత్సలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎంత మందికి చికిత్స అందించారు.. ఎంతమంది మెరుగైన ఆరోగ్యం సంపాదించారని వివరాలపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది సర్వే చేసి పిల్లల్లో ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి బాలలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు భరత్ చంద్ర, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న బీమాకు నేటితో గడువు పూర్తి

సాలూరు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు బీమా చేయించుకోవడానికి ఈ నెల 31 ఆఖరి రోజు అని వ్యవసాయాధికారి కె.శిరీష్ అన్నారు. బుధవారం నార్లవలసలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న రైతులు తమ పంటకు ప్రీమియం రూ.330లు చెల్లించి బీమా పొందాలన్నారు. వరి పంటకు వచ్చే నెల 15 వరకు గడువు ఉందన్నారు. ఎకరానికి రూ. 800 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, వరి గట్లపై కంది సాగు సస్యరక్షణ చర్యలు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి, జూలై30 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ బడే శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. గరుగుబిల్లితో పాటు గొట్టివలస, గొల్లవానివలస, రావుపల్లి, కొత్తూరు, తులసిరామినాయుడువలస, గొట్టివలస, మరుపెంట, దళాయివలస, బురదవెంకటాపురం, పెద్దూరు, కొత్తపల్లి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట, జూలై30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. బలిజిపేటలో రూ.1.08 కోట్లతో నిర్మించిన కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని ఆయన బుధవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ విద్యారంగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమానికి ముందుగా బలిజిపేట ఉన్నత పాఠశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు, సర్వశిక్ష అభియాన్ అధికారి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే..

● సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెలవలసలో రూ.1.95 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన కోసం ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వనరుల మెరుగుదల కోసం విద్యాశాఖ మంత్రిలోకేశ్ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థలో దేశంలోనే ఏపీని నెంబర్ వన్‌గా నిలపాలన్నది మంత్రి లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సర్వశిక్ష అభియాన్ అధికారి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాదెలవలసలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ జాతీయ సమావేశానికి 'బత్తిన'

పాలకొండ, జూలై30 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆగస్టు 2న కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న జాతీయ స్థాయి సమావేశానికి పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బత్తిన మోహన్‌ను పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఎంపిక చేశారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీఅగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు హాజరు కానున్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

గరుగుబిల్లి, జూలై30 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కులకు ప్రజలు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్ నాయుడు హెచ్చరించారు. బుధవారం మండలంలోని పెద్దూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ కుల, మత, వర్ణ వివక్ష నిర్మూలనపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అలాగే చట్టాలు, సమానత్వం కోసం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువకండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనా విధానం దిశగా జనసేన నాయకులు పయనించాలని ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. శ్రీకాకుళంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల నాయకులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు.కార్య క్రమంలో జిల్లాకు సంబంధించిన మిగిలిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

బెలగాం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. అందుకోసం సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. బుధవారం పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ సత్యవతి

పాచిపెంట, జూలై30 (ఆంధ్రజ్యోతి): రైతులు డ్రోన్‌తోపురుగు మందు పిచికారీ చేయవచ్చునని సాలూరు వ్యవసాయశాఖ ఏడీ సత్యవతి తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తవలసలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా క్షేత్రస్థాయిలో డ్రోన్ కెమెరాపై రైతులకు అవగాహన కల్పించారు. కొత్తవలసకు చెందిన మతల బలరాం పొలంలో పత్తి పంటకు డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు. ఏడు నిమిషాల్లోనే ఎకరా పొలంలో పంటను పిచికారీ చేయవచ్చన్నారు. ఈ విధానం వల్ల రైతుకు ఆర్థికభారం తగ్గుతోందన్నారు. మండలంలోని మాతుమూరులో గల బంగారమ్మ రైతు మిత్ర సంఘానికి డ్రోన్‌ను ప్రభుత్వం 80 శాతం రాయితీతో మంజూరు చేసిందన్నారు. దాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గూడేపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, చల్లా కనకబాబు, పల్లేడ ఉమామహేశ్వరరావు, ఏవో కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

నానో ఎరువులతో పంటలకు మేలు

మక్కువ రూరల్, జూలై30 (ఆంధ్రజ్యోతి): పంటలకు నానో ఎరువులు వాడటంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి చింతల భారతి తెలిపారు. మండలంలోని దబ్బగెడ్డ, మక్కువ గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఖరీఫ్ సాగులో పంటల దిగుబడికిచేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. వరి నాట్లు వేసేటప్పుడు నారు చివర్లను తుంచి నాటాల న్నారు. అలా చేయడం వల్ల కాండం తొలిచే పురుగు బారి నుంచి పైరును కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు హేమంత్, రైతులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సూర్యనారాయణ

పాలకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నెల్లి సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణలో బెహర బంగారు అధ్యక్షతన పాలకొండ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూసీపీఐ నిరంతరం కష్టజీవుల తరపున భూమి కోసం, భుక్తి కోసం దేశ విముక్తి కోసం పోరాడుతోందన్నారు. కార్య క్రమంలో ఉత్తరావల్లి మురళీమోహనరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, ద్వారపూడి అప్పలనాయుడు, బుడితి భారతి, స్వామిశేఖర్, శ్రీనివాసరావు, ఆదినారాయణ, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహాసభలో నూతన సమితిని ఎన్నుకున్నారు.

● గుమ్మలక్ష్మీపురం: పాలకొండలో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ రెండో జిల్లా మహాసభలను అందరూ జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కుండంగి లింగరాజు అధ్యక్షతన జరిగిన గుమ్మలక్ష్మీపురంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం పురవీధులు, సంతలో మహాసభల కోసం ప్రచారం నిర్వహించారు.కార్య క్రమంలో జిల్లా సమితి సభ్యుడు పువ్వల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొత్స మోహనరావు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస, జూలై30 (ఆంధ్రజ్యోతి): బిత్రపాడులో సారా విక్రయాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. దాడుల్లో 20 లీటర్ల సారాతో ఒకరిని అరెస్టు చేసిరిమాండ్‌కుతరలించామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ, పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గరుగుబిల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.రజనికుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐదో తరగతిలో 15 సీట్లు, ఆరో తరగతిలో 2, పదో తరగతిలో మూడు సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ఐదు సీట్లు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 11 సీట్లు, బైపీసీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జూలై 31న గురువారం ఉదయం గరుగుబిల్లిలోని పాఠశాలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలనికోరారు.

ఏవోబీలో రెడ్ అలెర్ట్


గుమ్మలక్ష్మీపురంలో వాహనాలు తనిఖీ..


కొమరాడలో..


సాలూరు రూరల్‌లో..

గుమ్మలక్ష్మీపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాలు సందర్భంగా ఏవోబీలో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. పోలీసులు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ పరిధిలో చెక్‌పోస్టుల వద్ద సాయుధ పోలీసులను ఏర్పాటు చేసి వచ్చిపోయే వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఎల్విన్‌పేట సీఐ హరి పర్యవేక్షణలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.

● కొమరాడ: కొమరాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర రహదారిలో కల్వర్టులు, ప్రధాన స్థలాలను బాంబు డిస్పోజల్ టీం బుధవారం తనిఖీ చేసింది. కోనేరు చెక్‌పోస్టు వద్ద పారా మిలటరీ బలగాలతో ఒడిశా నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం, సిబ్బంది, కేంద్ర పారా మిలటరీ బలగాలుతనిఖీల్లో పాల్గొన్నారు.

● సాలూరు రూరల్: సాలూరు మండలంలో బుధవారం సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ ఆదేశాల మేరకు ఎస్.ఐ నరసింహమూర్తి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎరగడవలస బూర్జి జంక్షన్, దండిగాం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు.కల్వర్టులను భద్రతాదళాలు పరిశీలించాయి. మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టామని రూరల్ ఎస్.ఐ నర్సింహమూర్తితెలిపారు.

● సీతంపేట రూరల్: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ పార్క్ సమీపంలో ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలునిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే దోనుబాయిలో ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో బుధవారం నాకాబందీ నిర్వహించారు.


సీతంపేటలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు